
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 23 । మే । 2025



టన్ను చీనీ రూ.38,120

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38,120, కనిష్టంగా రూ.4,100 పలికాయి.



టూరిజంపై నీలినీడలు

జిల్లాలో పర్యాటక రంగం తిరోగమనంలో పయనిస్తోంది. పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. 10లో

గరిష్టం/కనిష్టం
33.7°/22.1°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కూడా తగ్గింది.. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ అధికారులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ (రెగ్యులర్)(లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్) ఫలితాలు విడుదలయ్యాయి. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత గురువారం ఫలితాలు విడుదల చేశారు. మొత్తం 6,361 మంది పరీక్ష రాయగా, 6,270 (98.57 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏ కోర్సులో 346 మందికి గాను 339 మంది (97.98 శాతం), బీబీఏ కోర్సులో 530 మందికి గాను 521 (98.30 శాతం) మంది, బీసీఏలో 59 మందికి గాను 59 (100శాతం) మంది, బీఎస్సీలో 1,809 మందికి 1,780 (98.40 శాతం), బీకాంలో 3,617 మందికి 3,571 (98.73 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఫలితాలకు జ్ఞానభూమి పోర్టల్‌లో చూడాలని కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత

పుట్టపర్తి టౌన్: యోగా సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి గణేష్ కూడలిలో ఉన్న మైనార్టీ షాదీమహల్‌లో రెండోరోజు నిర్వహించిన యోగా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మానవుని జీవితంలో యోగా దినచర్య కావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, యోగా గురువులు పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి

పరిగి: భూముల రీసర్వే పక్కాగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మోదా పంచాయతీలోని పుట్టగూర్లపల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. రీసర్వేకు సంబంధించి తగిన సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. అంతకుముందు కొడిగెనహళ్లిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు శుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని ప్రిన్సిపాల్ రాజేశ్వరికి సూచించారు. జేసీ వెంట తహసీల్దార్ హసీనా సుల్తానా, ఆర్‌ఐ సిద్దేశ్వర్ తదితరులు ఉన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

- విగ్రహాలు 20 అడుగులకు మించరాదు
- సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం: గో గ్రీన్ నినాదంతో వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్టించి పూజిద్దామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. గణేష్ పండుగ, నిమజ్జనం ఏర్పాట్లపై హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వినాయక సేవా సమితి సభ్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్‌కలెక్టర్ మాట్లాడుతూ వినాయక విగ్రహాలను మట్టితో సిద్ధం చేయడంతో పాటు 20 అడుగులు మించి ఎత్తు లేకుండా చూడాలని కోరారు. అధిక ఎత్తుకల్గిన విగ్రహాలను ఊరేగింపు, తరలింపు, నిమజ్జన సమయంలో వస్తున్న ఇబ్బందులను నిర్వాహకులు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో హిందూ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా కళాకారుల నృత్యాలు, చెక్కభజనలు, కోలాటం లాంటివి ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా డీజేలు లేకుండా సన్నాయి మేళతాళాలు లాంటి వాటితో భక్తిభావం పెంపొందించేలా కృషిచేయాలన్నారు. రోడ్లపై ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనంలో కోనేరు వద్ద వస్తున్న నీటి సమస్య, శుభ్రం చేయడం, పూడిక తీయడం చేయవచ్చన్నారు. అయితే కోనేరులో పెద్ద బండరాయి ఉందని, దానిని తొలగిస్తే విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది ఉండదని వినాయక సేవాసమితి సభ్యులు తెలిపారు. అయితే అది చాలా ఖర్చుతో కూడుకున్నదని, మున్సిపాల్టీ ద్వారా చేయడం కష్టసాధ్యమని కమిషనర్ తెలిపారు. ప్రత్యేక నిధులు విడుదల చేస్తే తొలగింపు పనులు చేయడానికి వీలవుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేష్, డీఎస్పీ మహేష్, పట్టణ నాయకులు విద్యాసాగర్, జేపీకే రాము, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పవనపుత్రా.. పాహిమాం!



నల్లచెరువు మండలంలోని ప్రసిద్ధ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి గ్రామోత్సవం





హిందూపురంలో శోభాయాత్రలో భారీ హనుమాన్ విగ్రహం, వెండిరథంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు, మెయిన్ బజారు గుండా బైక్ ర్యాలీతో వస్తున్న భక్తులు

హనుమజ్జయంతి జిల్లా అంతటా గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు, రథోత్సవాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు ఉపవాసాలు ఉండి స్వామివారిని సేవించుకున్నారు. ఎక్కడ రాముడిని కీర్తిస్తారో.. అక్కడ హనుమ అనుగ్రహ ప్రదాత అయి ఉంటాడని, హనుమ పేరును ఉచ్ఛరించిన చోట సీతారాములు కొలువై ఉంటారని పూజారులు పేర్కొన్నారు. 'హనుమ బలం.. అసమానమైన భక్తి. నిస్వార్థ సేవకు ప్రతీక అని కొనియాడారు.

– సాక్షి, పుట్టపర్తి

విత్తు.. విపత్తు

వర్షాలు ముందుగానే మురిపిస్తున్నాయి. దుక్కి దున్నేందుకు ఇదే మంచి అదను. ఇప్పటికే చాలామంది రైతులు పొలాన్ని సిద్ధం చేసి ఉంచారు. మరో వర్షం పడితే అదనులోనే విత్తనం వేద్దామనే ఆలోచనలో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలేదు. గతేడాది కూడా సర్కారు సాయం లేదు. విత్తన ప్రణాళిక గురించి ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి ప్రణాళికా విడుదల చేయలేదు.

- వ్యవసాయాన్ని పట్టించుకోని ప్రభుత్వం
- అదను సమీపిస్తున్నా అందని విత్తనం
- వర్షాలు కురుస్తున్నా ఇబ్బందుల్లోనే రైతులు
- విత్తనాలు, ఎరువుల ప్రస్తావన లేక ఆందోళన



సాక్షి, పుట్టపర్తి: ప్రతి ఏటా మే నెలలో దుక్కి దున్నే సమయానికి రైతులందరూ రాయితీ విత్తనాల కోసం వెంపర్లాడేవారు. ప్రభుత్వం నుంచి మే రెండో వారం నుంచి రాయితీ విత్తనాలు రైతులకు పంపిణీ చేసేవారు. అయితే ఈసారి ఇప్పటి వరకు రాయితీ సంగతి పక్కన పెడితే.. విత్తన ప్రాసెసింగ్ కూడా మొదలుపెట్టిన దాఖలాలు కనిపించలేదు. దీంతో విత్తనాలు ఎప్పుడు ఇస్తారోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు కురిసిన వర్షాలకు పొలం చదును చేసుకున్నారు. నెలాఖరున నైరుతి రుతు పవనాలు జిల్లాలోకి ప్రవేశించగానే విత్తనాలు వేసేందుకు రైతులందరూ సిద్ధంగా ఉన్నారు. అయితే ఇప్పటి వరకు విత్తన ప్రణాళిక గురించి పాలకులు, అధికారులు ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం.

ముందస్తు మురిపెం ముంచేనా?..

సకాలంలో వర్షాలు వస్తేనే.. పంట సరిగ్గా చేతికందుతుందని ఏ రైతును అడిగినా చెబుతారు. అయితే ఈ ముందస్తు వర్షాలు దుక్కి దున్నేందుకు పనికి వచ్చినా.. తర్వాత ముఖం చాటేస్తే పరిస్థితి ఏందని రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. గతంలో చాలాసార్లు ముందస్తు వర్షాలతో నష్టం వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఈసారి కూడా అలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ముందస్తు వర్షాలతో.. దుక్కి దున్నితే.. ఆ తర్వాత వచ్చే వర్షాలకు విత్తనం వేస్తేనే పంట దిగుబడి వస్తుందని వివరించారు. ముందస్తు వర్షాలకు మురిసిపోయి.. విత్తనాలు వేస్తే పంట దెబ్బతినే అవకాశం ఉందని సలహా ఇస్తున్నారు. ఖరీఫ్‌లో ప్రధానంగా కంది, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, వరి, రాగి, పొద్దుతిరుగుడు, పత్తి, మిరప, జొన్న, పప్పుశనగ, కొర్ర, అలసంద, పెసర తదితర పంటలు సాగు చేయనున్నారు.

జిల్లాలో మొత్తం భూ విస్తీర్ణం: 3.20 లక్షల హెక్టార్లు

సాధారణ సాగు విస్తీర్ణం: 2.20 లక్షల హెక్టార్లు

ప్రధాన పంటలు: వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, రాగి, పత్తి

సాయం అందించండి



ఈ ఏడాది ఆరంభం నుంచే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. సామాన్య రైతులు పంట పెట్టేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఎరువులు, విత్తనాల కోసం అప్పులు చేసే పరిస్థితి నెలకొంది. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలి. రైతులు అప్పులబారిన పడకుండా చూడాలి.

– తలారి వెంకటేశులు, రైతు, మావటూరు, పెనుకొండ మండలం

విత్తనాల కోసం ఎదురుచూపు



ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల కోసం ఎదురుచూస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం కింద ఇవ్వాల్సిన రూ.20 వేల గురించి ప్రస్తావించలేదు. ముందస్తు వర్షాలు వస్తుండటంతో రైతులు అప్పులు చేసి విత్తనాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి గ్రామస్థాయిలోనే విత్తనకాయలు పంపిణీ చేయాలని కోరుతున్నాం.

– శ్రీరామిరెడ్డి, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

త్వరలో పంపిణీ చేస్తాం



ఖరీఫ్‌లో అత్యవసరంగా వేరుశగన, జీలగ, కంది వేసుకోవచ్చు. మిగతా పంటలు కొంచెం ఆలస్యమైనా పర్లేదు. విత్తనాలు బయటి నుంచి వస్తాయి. త్వరలోనే ఆర్‌ఎస్‌కేల ద్వారా పంపిణీ చేస్తాం. ప్రస్తుత వర్షాలకు ఎవరూ విత్తనం వేయొద్దు. నెలాఖరులో రుతుపవనాలు వస్తాయి. జూన్ నుంచి విత్తనాలు వేసుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. 40 శాతం రాయితీతో విత్తనాలు అందజేస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. ఎరువులు కూడా పుష్కలంగా ఉన్నాయి.

– వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి, పుట్టపర్తి

అభివృద్ధి పథంలోకి తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక, ఎగుమతుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో నూతనంగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన 21 యూనిట్లకు గడువులోగా అనుమతులు మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి పెట్టుబడి, విద్యుత్, వడ్డీ రాయితీలకు గాను 37 దరఖాస్తులకు రాయితీ మంజూరు చేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మొహమ్మద్ షఫీ, విస్తరణ అధికారులు సంజీవరాజు, ఓబులేసు, దుర్గేష్, డీపీఓ సమత, జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతు, పునరుద్ధరణ చేపట్టండి

జిల్లాలో ఉన్న చిన్ననీటిపారుదల చెరువుల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్ శాఖల అధికారులతో చెరువుల రిపేరీ, రెనోవేషన్, రీస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) స్కీంపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,186 చిన్న, పెద్ద చెరువులు ఉన్నాయని, సుమారు 83,486 ఎకరాల ఆయకట్టు ఉందని పేర్కొన్నారు. మరమ్మతులు, పునరుద్ధరణ చేయాల్సిన చెరువులను గుర్తించి, ఎకరాకు ఎంత మొత్తం అవసరమవుతుందో ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ విశ్వనాథరెడ్డి, ఈఈలు గురుమూర్తి, సురేంద్రరెడ్డి, డీఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్లకూ అన్యాయం

టీడీపీలో పెల్లుబుకుతున్న అసమ్మతి

- ఇటీవల 'అనంత మినీ మహానాడు'లో కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- శింగనమల ఎమ్మెల్యే అవినీతిపై మంత్రికి ఓ తమ్ముడి ఫిర్యాదు
- గుంతకల్లు ఎమ్మెల్యే కుమారుడి దెబ్బకు ఒక కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- హామీల అమలులో చేతులెత్తేసి అన్ని వర్గాలకూ ఇప్పటికే మోసం
- తమనూ దగా చేయడంపై 'తమ్ముళ్లు' రగిలిపోతున్న వైనం



అనంతపురం మినీ మహానాడులో పురుగుమందు తాగిన టీడీపీ ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడు వెంకటేష్



వెంకటేష్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్తున్న టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ముందు అలవిగాని హామీలిచ్చి నేడు మోసం చేయడంతో అన్ని వర్గాలు అసంతృప్తిలో ఉన్నాయి. మరోవైపు ఎమ్మెల్యేల తీరుతో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ఇదే క్రమంలో తమను అన్యాయం చేస్తున్నారంటూ సొంత పార్టీకి చెందిన 'తమ్ముళ్లు' కూడా అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నారు. కూటమి సర్కారులో ఎమ్మెల్యేల దెబ్బకు టీడీపీ కార్యకర్తలూ కుదేలవుతున్నారు. 11 నెలలు కూడా తిరక్కముందే ఎమ్మెల్యేలపై బహిరంగంగానే టీడీపీ కార్యకర్తలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తుండటం కలకలం రేపుతోంది. అవినీతి, అక్రమాలు, కబ్జాలు, వసూళ్లతో తమను గాలికొదిలేశారని, పార్టీని గెలిపించి తప్పు చేశామంటుండటం గమనార్హం.

ప్లాంట్ అప్పగించాలని వేధింపులు..

పెనుకొండ నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా 'గ్రీన్ టెక్' పేరుతో ఓ వ్యక్తి రీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నడుపుతున్నాడు. అయితే, ఈ ప్లాంటుపై కన్నేసిన మంత్రి సవిత తనకు అప్పగించాలంటూ నిర్వాహకుడిని భయపెట్టడం ప్రారంభించింది. కుటుంబానికి జీవనాధారమైన ప్లాంటును ఇవ్వాలనడంతో బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. చివరకు విధిలేని పరిస్థితుల్లో మంత్రి ఒత్తిడికి తట్టుకోలేక ఎంపీ పార్థసారధిని భాగస్వామిని చేసుకుని నడుపుకుంటున్నారు.

ఉద్యోగులు.. అంగన్‌వాడీల పరిస్థితి ఘోరం

గత ఎన్నికల ముందు ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలకు టీడీపీ నేతలు ఎన్నో హామీలు ఇచ్చారు. తీరా ఇప్పుడు చూస్తే ఎమ్మెల్యేలు ఉద్యోగులను దారుణంగా చూస్తున్నారు. మొన్నటికి మొన్న మార్కెట్ యార్డులో ఓ ఉద్యోగిని ''గాడిదలు కాస్తున్నావా'' అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి అనడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. ఇక.. అంగన్‌వాడీ కార్యకర్తలు వేతనాల పెంపు కోసం ఇప్పటికే చలో విజయవాడ ధర్నాలతో హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మిడ్ డే మీల్స్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను బెదిరించి ఉద్యోగాలు పీకేస్తున్నారు. సీఐలు, తహసీల్దార్‌లను ఇంట్లో పనిమనుషులకంటే హీనంగా చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యులను సైతం ఇష్టారాజ్యంగా తిడుతున్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను రేషనలైజేషన్ పేరుతో ముప్పు తిప్పలు పెడుతున్నారు.

- 'నేను పార్టీకి ఎంతో కష్టపడి చేసినా న్యాయం చేయలేకపోయారు' అంటూ మూడు రోజుల క్రితం అనంతపురంలో ఎస్సీ సెల్ నగర కార్యదర్శి వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మినీ మహానాడు' కార్యక్రమంలో విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయన పరిస్థితి ఇప్పుడు విషమంగా ఉంది. పట్టించుకునే దిక్కులేక ఆ కుటుంబం వీధిన పడింది. ఇలాంటి కుటుంబాలు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో చాలానే ఉన్నాయి.
- 'శింగనమలలో వెస్ట్ నరసాపురం నుంచి గెలిచిన ఏకైక టీడీపీ ఎంపీటీసీ నా భార్య అంజనమ్మ. కానీ మాకు ఎమ్మెల్యే ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదు' అంటూ టీడీపీ నేత ప్రసాద్ నాయక్ ఏకంగా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే శ్రావణి ఎన్నిసార్లు వెళ్లినా పట్టించుకోలేదని, ఆమె తల్లి లీలావతి షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతూ వసూళ్లకు పాల్పడుతోందంటూ మంత్రికి వివరించాడు.
- తన కుమారుడికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తానని రూ.4 లక్షలు తీసుకుని మరొకరికి పోస్టు ఇవ్వడంతో గుంతకల్లుకు చెందిన టీడీపీ కార్యకర్త బిల్లే ఎల్లప్ప ఆత్మహత్యకు యత్నించాడు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తమ్ముడు గుమ్మనూరు నారాయణ.. బిల్లే ఎల్లప్ప కుమారుడు గిరీష్‌కు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్తానని రూ.4 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత జయరాం కుమారుడు ఈశ్వర్.. గిరీష్‌ను తొలగించి మరొకరి దగ్గర రూ.8 లక్షలు తీసుకుని ఉద్యోగమిచ్చారు. దీంతో ఎల్లప్ప మనస్తాపంతో ఉరి వేసుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. ఈ మూడే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో నేడు చాలామంది టీడీపీ కార్యకర్తలు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు

'ఉపాధి'లో అవినీతిని ఎండగడదాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి, చిత్రంలో వెన్నపూస రవీంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు

- బోగస్ మస్టర్లతో అక్రమాలు
- కూటమి నేతల జేబుల్లోకి రూ.కోట్ల నిధులు
- స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న సర్కారు
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ధ్వజం

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో జరుగుతున్న అవినీతిని ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ధర్మవరంలోని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసం వద్ద కేతిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రతినిధులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి కేతిరెడ్డి మాట్లాడారు. పనులు లేక కూలీలు వలస పోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అధికార పార్టీ నాయకులు బోగస్ మస్టర్లతో రూ.కోట్లు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. ఈ అవినీతిని అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో నిధులన్నీ కూటమి నాయకులు జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు. పంచాయతీల్లో సర్పంచ్, పాలకవర్గ తీర్మానం లేకుండా ఎవరు పడితే వారు పనులు చేయిస్తున్నారన్నారు. ఇలా చేయడం చట్ట విరుద్ధమని తెలిసి కూడా అధికారులు వారినే ప్రోత్సహించడం శోచనీయమన్నారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,150 కోట్లను పంచాయతీలకు కేటాయించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు దారి మళ్లించారన్నారు. ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవం కూడా కూటమి ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తోందన్నారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు.

పోరుబాటకు దిశానిర్దేశం..

ధర్మవరం నియోజకవర్గంలో ఇసుక, మట్టి దందా పెట్రేగిపోతోందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. రోజూ వందల కొద్దీ వాహనాల్లో ఇసుక తరలిపోతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ధర్మవరం ఆర్డీఓ అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఉపాధి నిధుల దారి మళ్లింపు.. స్థానిక సంస్థల నిర్వీర్యంపై పోరుబాటకు దిశానిర్దేశం చేశారు. అవినీతిని ప్రోత్సహిస్తున్న అధికారులపై చట్టపరంగా పోరాటం చేసి, బాధ్యులకు శిక్షలు పడే విధంగా అందరూ కలసి కట్టుగా కృషి చేద్దామన్నారు. మరో ఏడాదిలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటి నుంచే పట్టణ, గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేద్దామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణంలోని కౌన్సిలర్లు, ఇటీవల నియామకమైన వైఎస్సార్‌సీపీ విభాగం వివిధ అనుబంధ కమిటీల నాయకులు, సభ్యులు, నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినతులకు పరిష్కారం చూపండి

- ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో అధికారులకు ఇచ్చిన వినతులపై పరిష్కారం చూపాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్‌వీవీ రమణయ్య, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, నరేష్ తదితరులు డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రేడ్–2 ఉపాధ్యాయులకు సంబంధించి యాజమాన్యాల వారీగా అడక్వసీ ప్రకటించిన తర్వాతనే ప్రమోషన్లు చేపట్టాలన్నారు. సీనియార్టీ జబితాలో అసంబద్ధాలను తొలిగించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో రీస్ట్రక్చర్ జరిగిన తర్వాత కేటగిరీల వారీగా, యాజమాన్యాల వారీగా పాఠశాలలకు కేటాయించిన పోస్టులను అధికారికంగా విడుదల చేయాలన్నారు. 2017 బదిలీల నుంచి 2023 బదిలీల వరకు ప్రిఫరెన్షియల్, స్పౌజ్ వాడుకున్న ఉపాధ్యాయుల జాబితాలనూ ప్రకటించాలన్నారు. ప్రస్తుత బదిలీల్లో అనర్హులైన ప్రిఫరెన్షియల్, స్పౌజ్ దుర్వినియోగం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ మీడియంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తితో సంబంధం లేకుండా టీచర్ పోస్టులు కేటాయించాలన్నారు.

మహిళపై దాడి

తనకల్లు: మద్యం మత్తులో మహిళపై దాడి చేసిన ఘటన గురువారం నందిగానిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన రవి గురువారం ఉదయం మద్యం తాగి అదే గ్రామానికి చెందిన ఆదిలక్ష్మిపై దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆమెను వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో చికిత్స కోసం తనకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గిరిజన సలహా మండలి సభ్యుడిగా సోమ్లానాయక్



కదిరి అర్బన్: రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడిగా కదిరి మండలం సున్నపుగుట్టతండాకు చెందిన సభావత్ సోమ్లానాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

టూరిజంపై నీలినీడలు

- జాతీయ రహదారిపై నిరుపయోగంగా పర్యాటక హోటళ్లు
- రూ.కోట్ల ప్రజాధనం వృథా
- సౌకర్యాలు లేక లేపాక్షి, వీరాపురానికి తగ్గుతున్న పర్యాటకుల సంఖ్య





కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద శిథిలావస్థలో ఉన్న టూరిజం శాఖ హరిత హోటల్ , లేపాక్షిలో నిరుపయోగంగా ఉన్న ఎంపోరియం భవనం

చిలమత్తూరు: జిల్లాలో పర్యాటక రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రముఖ పర్యాటక కేంద్రాలను సందర్శించే వారి సంఖ్య క్రమేణ తగ్గుముఖం పట్టింది. పర్యాటక ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం... ఉన్నవాటిని సైతం ప్రైవేట్ పరం చేయడం తదితర అంశాలు పర్యాటక రంగం తిరోగమనానికి కారణమవుతున్నాయి.

నిర్లక్ష్యం నీడన 'హరిత'..

పర్యాటకం అనగానే ముందుగా గుర్తొచ్చేది హరిత హోటళ్లు. జిల్లాలో వాటి పరిస్థితి దయనీయంగా మారింది. 44వ జాతీయ రహదారి కొడికొండ చెక్ పోస్ట్‌లోని టూరిజం శాఖకు చెందిన హరిత హోటల్ శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు ఈ హోటల్ వద్ద బస్సులు బారులు తీరేవి. పర్యాటకులు, వాహనదారులతో నిత్యమూ కిటకిటలాడేది. నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో చుట్టూ దట్టంగా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. కేవలం అసాంఘిక కార్యకలాపాలు మాత్రమే ఇక్కడ కొనసాగుతుంటాయనే ఆరోపణలున్నాయి. టూరిజం శాఖ వైఫల్యానికి రూ.కోట్ల ప్రజాధనం వృథా అయింది. అత్యధికంగా పర్యాటకులు లేపాక్షి సందర్శనకు వస్తుంటారు. ఆ సమయంలో వీరు సైబీరియన్ పక్షలను చూసేందుకు వీరాపురం గ్రామాన్ని సందర్శిస్తుంటారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులు సేద తీరేందుకు పర్యాటక శాఖ ఓ భవనాన్ని సైతం నిర్మించింది. అయితే దీని నిర్వహణనూ గాలికి వదిలేయడంతో ఆ భవనం దయనీయ స్థితికి చేరుకుంటోంది. పర్యాటకుల కోసం వీరాపురంలో కనీసం వాచ్ టవర్ కూడా ఏర్పాటు చేయలేకపోయింది.

భవనాలు ఉన్నా నిర్వహణ శూన్యం..

కొడికొండ చెక్‌పోస్ట్‌లోని హరిత హోటల్, వీరాపురంలోని హరిత భవనం, లేపాక్షిలోని ఎంపోరియం భవనాన్ని పర్యాటక శాఖ నిరుపయోగంగా వదిలేసింది. లేపాక్షిలోని ఎంపోరియంలో చేతివృత్తి కళాకారులకు అవకాశం కల్పిస్తే పర్యాటకుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయంతో పాటు కళాకారులకూ విస్తృత ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా... పర్యాటక శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. లేపాక్షిలోని జటాయువు స్మారకం వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను సైతం ప్రజా వినియోగంలోకి పర్యాటక శాఖ తీసుకురాలేకపోతోందంటే నిర్లక్ష్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. పెనుకొండలో కుంభకర్ణ పార్క్, కదిరి నియోజకవర్గంలోని తిమ్మమ్మ మర్రిమాను, కటారుపల్లి వంటి ప్రాంతాలను సైతం పర్యాటక రంగం నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలున్నాయి.

అభివృద్ధి కోసం నిధులు కోరాం

హరిత హోటల్ నిర్వహణ ఏపీటీడీసీ పరిధిలో ఉంటుంది. అయితే వాటి మరమ్మతుల కోసం నిధులు కావాలని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. నిధులు విడుదల కాగానే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తాం. టెండర్ ప్రక్రియ ద్వారా హరిత హోటల్‌ను ప్రైవేటుకు అప్పగిస్తుండడం వాస్తవం. పర్యాటకులను ఆకర్షించేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– నరసయ్య, జిల్లా పర్యాటక శాఖాధికారి

వ్యక్తి బలవన్మరణం



సుబ్బరాయప్ప (ఫైల్)

పరిగి: మండల కేంద్రంలో నివాసముంటున్న సుబ్బరాయప్ప(49) అలియాస్ మేఘాలు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూలీ పనులతో జీవనం సాగిస్తున్న సుబ్బరాయప్పకు భార్య చౌడమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే గురువారం నొప్పి తీవ్రత తాళలేని ఆయన గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు వెంకటేశ్వర్లు

గుత్తి రూరల్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (44) వ్యక్తిగత పనిపై గురువారం గుత్తికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. గుత్తి మండలం వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- బీసీ మహిళ ప్రతిష్టకు భంగం కలిగించారు
- ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం: 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. ఒక బీసీ మహిళ జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో ఉంటే కూటమి ప్రభుత్వానికి కంటగింపుగా మారింది' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ ధ్వజమెత్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి ముగ్గురు ఎమ్మెల్యేలు చొరబడి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను ధ్వంసం చేయడంపై నిరసన తెలిపారు. అప్రజాస్వామికంగా వ్యవహరించిన ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ అనంతపురం టౌ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్‌తో కలిసి గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం గోరంట్ల మాధవ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ భేటీ బచావో..భేటీ పడావో అంటూ దేశంలో మహిళల సర్వతోముఖాభివృద్ధి వైపు అడుగులు వేస్తుంటే రాష్ట్రంలో మాత్రం మహిళలను అవమానపరుస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లోకి దౌర్జన్యంగా వెళ్లి ఆమె ప్రతిష్టను దెబ్బతీసే రీతిలో వ్యవహరించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనుమతి లేకుండా చాంబర్‌లోకి వెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో కిందపడేసి, ధ్వంసం చేశారని, సీఈఓను భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. జెడ్పీ సమావేశం జరుగుతుండగా, గందరగోళమైన పరిస్థితిని సృష్టించారన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా తలదించుకునే రీతిలో ప్రవర్తించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో పెట్టుకోవడం ఆమెకు ఉన్న హక్కు అని పేర్కొన్నారు. బీసీ బోయ సామాజికవర్గానికి చెందిన గిరిజమ్మను అవమానపరిచే రీతిలో ప్రవర్తించడం చాలా బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలే దౌర్జన్యాలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. ఏకంగా జెడ్పీ చైర్‌పర్సన్‌నే అవమానానికి గురిచేయడం, వారి అనుచరులు మేయర్ వసీం సలీం చాంబర్‌లోనూ ఇదే తరహాలో ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు దాదు, జిల్లా సభ్యులు పావురాల జగదీష్, యువజన విభాగం నగర ఉపాధ్యక్షులు ఉదయ్, వినీత్, జనరల్ సెక్రెటరీ బిల్లే నాగార్జున, సెక్రెటరీలు వేణు, మైను, బ్రహ్మానంద రెడ్డి, వెంకట సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, స్టేట్ స్పోక్ పర్సన్ సాకే చిరంజీవి, నాగార్జున నాయక్, గౌతమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి



దాడిని వివరిస్తున్న వెంకటేష్‌రెడ్డి

పరిగి: మండలంలోని చెర్లోపల్లికి చెందిన మండల వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డిపై చిత్తూరు జిల్లాకు చెందిన బాబు, మరో ఐదుగురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.. చెర్లోపల్లి వద్ద సర్వే నంబరు 232–1, 2 లెటర్ పైకి వెంకటేష్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులకు 4.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వెంకటేష్‌రెడ్డికి చెందిన 2.15 ఎకరాలలో అరటి, ఇతర అంతర పంటలను సాగు చేశారు. పంట కాలం పూర్తి కావడంతో అరటిని తొలగించారు. ఈ క్రమంలో గురువారం ఆ భూమి తనదేనంటూ కొందరు అనుచరులతో బాబు దౌర్జన్యానికి దిగాడు. జేసీబీతో పొలంలోని అవిశ చెట్లను తొలగించి పొలాన్ని దుక్కి చేస్తూ డ్రిప్, పైప్ లైన్ పరికరాలను ధ్వంసం చేశాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న వెంకటేష్‌రెడ్డితో ఘర్షణ పడి తన అనుచరులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెంకటేష్‌రెడ్డిని హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాడుతో గొంతు బిగించి..

కొడవలితో తలను వేరు చేసి

- యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం టౌన్: ఈ నెల 15న చోటు చేసుకున్న యువకుడి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. రాయదుర్గం పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ జయనాయక్‌తో కలసి డీఎస్పీ పి.రవిబాబు వెల్లడించారు. రాయదుర్గం మండలం కొంతానపల్లికి చెందిన బోయ అంజినయ్య కుమారుడు వినోద్‌కుమార్ (22) టైలరింగ్‌తో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో స్వగ్రామంలో కాకుండా ఇతర ప్రదేశాల్లో స్థిరపడిన వినోద్‌కుమార్... ఇటీవల స్వగ్రామానికి చేరుకుని స్థానిక గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిలోకి చేరాడు. ఈ నెల 17న రాయదుర్గంలో జరిగిన ప్రసన్న వేంకటరమణ స్వామి రథోత్సవానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. 18న కొంతానపల్లి వద్ద పొలంలో హతుడై కనిపించాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో కొంతానపల్లికి చెందిన యువకులు నాయకుల రమేష్, నాయకుల బొమ్మలింగను గురువారం బళ్లారి మార్గంలోని చదం రైల్వే గేట్ వద్ద అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో హత్య చేసింది తామేనని అంగీకరించారు. హత్యకు గల కారణాలు వారు వెల్లడించారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన..

గ్రామంలోని మహిళల పట్ల వినోద్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా చెడుగా ప్రచారమూ చేసేవాడు. దీంతో వినోద్‌కుమార్‌పై కక్ష పెంచుకున్న రమేష్, బొమ్మలింగ.. వినోద్‌కుమార్‌ను హతమార్చాలని నిర్ణయించుకుని అవకాశం కోసం వేచి చూశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రాయదుర్గంలో శ్రీవారి రథోత్సవానికి వినోద్‌కుమార్ వెళ్లినట్లుగా తెలుసుకుని అదే రోజు దారి కాపుకాచారు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఒంటరిగా వస్తున్న వినోద్‌కుమార్‌ను అడ్డుకుని పొలాల్లోకి లాక్కెళ్లి తాడుతో గొంతు బిగించారు. అనంతరం పదునైన కొడవలితో గొంతు కోసి తలను వేరుచేసి గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించారు. హత్యకు ఉపయోగించిన నైలాన్‌తాడు, కొడవలి, మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

క్రికెట్ మ్యాచ్ తెచ్చిన తంటా.. రెండు వర్గాల ఘర్షణ



గాయపడిన సాయి

గుంతకల్లు: క్రికెట్ మ్యాచ్‌లో చిన్నపిల్లల మధ్య జరిగిన గొడవలో పెద్దలు తలదూర్చడంతో ఇరువర్గాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి దారి తీసింది. గురువారం వేట కొడవండ్లతో దాడులకు తెగబడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సత్యనారాయణపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో ఈ నెల 19న చిన్నపిల్లలు క్రికెట్ మ్యాచ్ ఆడారు. మ్యాచ్‌లో ఉడదాల గణేష్‌కు, ముక్కన్నగారి హస్సేన్ మధ్య ఘర్షణ జరిగింది. విషయాన్ని ఇంట్లో తెలపడంతో అదే రోజు రాత్రి ఇరు కుటుంబాల వారు గొడవపడ్డారు. ఆ సమయంలో ఉడదాల కుటుంబానికి చెందిన అంజి, వరుణ్, గణేష్ గాయపడ్డారు. దీంతో కక్ష పెంచుకున్న ఉడదాల కుటుంబసభ్యులు గురువారం రాత్రి సంజీవనగర్‌లో నివాసముంటున్న ముక్కన్నగారి హుస్సేన్ చిన్నాన్న సాయిప్రసాద్‌పై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి సాయిపై కొడవళ్లతో నరికి పరారయ్యారు. తలకు, కాళ్లకు తీవ్రమైన గాయాలైన సాయిని కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కాగా ఘర్షణ పడిన రెండు వర్గాలూ టీడీపీకి చెందిన వారే కావడం గమనార్హం. బాధితుల ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మొరం గోడ కూలి బాలిక మృతి

పరిగి: మండలంలోని గొరవనహళ్లిలో మిద్దె మొరం గోడ కూలి ఓ బాలిక మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. గొరవనహళ్లికి చెందిన దాసరి గోపి, గంగరత్న దంపతులతో కలసి వారి ఇంటి ఆవరణలో సమీప బంధువు ఆదిలక్ష్మి గురువారం సాయంత్రం భోజనం చేస్తుండగా ఒక్కసారిగా మిద్దె మొరం గోడ కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న గోపి కుమార్తె ఛాయశ్రీ (9), ఆదిలక్ష్మిని వెంటనే వెలికి తీసి హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఛాయశ్రీ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాలమైన ఆదిలక్ష్మికి చికిత్స అందజేస్తున్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): వయసు మీరిపోతున్నా... పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని సండూరు తాలూకా తుమటి గ్రామానికి చెందిన గంగాధర్ (32) తోరనగల్లు సమీపంలోని జిందాల్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బెంగళూరులో మరో పని చేసుకునేందుకు వెళుతున్న ఇంట్లో చెప్పి నెల రోజుల క్రితం బయటకు వచ్చాడు. అనంతరం కుటుంబసభ్యులు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం తుమటి గ్రామ శివారున కర్ణాటక సరిహద్దులోని డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం గ్రామ శివారులో చెట్టుకు వేసుకున్న ఉరికి వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 20 రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. విచారణలో మృతుడిని గంగాధర్‌గా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించి నిర్ధారించారు. పెళ్లి ప్రయత్నాలు చేసినా సంబంధాలు కుదరకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతుడి తండ్రి సిద్ధేశ్వర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

మెడికల్ కళాశాల అకౌంటెంట్ వాణిపై కేసు



సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యరావు

అనంతపురం: మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న మహిళా విద్యార్థినులకు సంబంధించిన మెస్ బిల్లులను నేరుగా సొంత ఖాతాలో జమ చేసుకున్న అకౌంటెంట్ వాణిపై కేసు నమోదు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ .మాణిక్యరావు కోరారు. ఈ మేరకు అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. హాస్టల్ బ్యాంకు ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఫోన్‌పే నంబర్‌కు మెస్ బిల్లుల మొత్తాన్ని అకౌంటెంట్ జమ చేయించుకున్నారన్నారు. కొన్ని నెలలుగా మెస్‌బిల్లుల మొత్తం హాస్టల్ బ్యాంకు ఖాతాకు జమ చేయలేదన్నారు. ప్రొఫెసర్ల కమిటీ విచారణలో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. డబ్బు తిరిగి చెల్లించేలా చూడాలని విన్నవించారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ





ఆలయంలో ప్రతిష్ఠించిన యల్లమ్మ విగ్రహాలు, కురుబల ఆరాధ్య దేవర్లను దర్శించుకుంటున్న భక్తులు

శింగనమల: మండలంలోని సోదనపల్లిలో గురువారం ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. రెండు రోజుల పాటు యల్లమ్మ పరుష, ఆగులూరప్ప స్వామి జల్ది పూజ వైభవంగా జరిగాయి. నూతనంగా నిర్మించిన ఆలయంలో యల్లమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుబల ఆరాధ్య దేవరలైన రేవణ్ణ సిద్దేశ్వరస్వామి, కాట్నే కాల్వ దేవరాయ గుణాచార్యులు, అతకల్లపట్నం పెద్దయ్య స్వామి, ఉజ్జినప్ప స్వామి, ఆగులూరప్ప స్వామి, నల్లబొల్లెప్ప స్వామి, కొండారుపల్లయ్య స్వామి, గుంతకల్లప్ప స్వామి, అంతరగంగప్ప స్వామి, నాగులబురజప్ప స్వామి, పెండేకల్లప్ప స్వామి, శిలారామప్ప స్వామి, పులిగుండ్ల బీరప్పస్వామి, తాడిపత్రిప్ప స్వామి, అయిలప్ప స్వామి, కోకొండ బీరప్ప స్వాములను గ్రామ పొలిమేర నుంచి అంగన్‌వాడీ స్కూల్ వరకూ ఊరేగించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.



విద్యుత్ దీపాలంకరణలో యల్లమ్మ దేవాలయం

నేడు రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం



ఉంతకల్లులో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం మంగళవాయిద్యాల నడుమ 101 కలశాలతో ఊరేగింపుగా గంగను తీసుకొచ్చి రుక్మిణీ పాండురంగస్వామికి క్షీరాభిషేకం, మహాగణపతి పూజ తదితర పూజలు చేయనున్నారు. అనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు స్వామి రథోవం జరగనుంది.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో రామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయ పురవీధులు పోటెత్తాయి. వేకువజామునే స్వామికి అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలంకరణ, తోమాల సేవ, స్వర్ణ వజ్రకవచ ఆలంకరణలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. యాగశాలలో ప్రత్యేక హోమాలను నిర్వహించిన వేదపండితులు పూర్ణాహుతితో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా ముగించారు. సాయంత్రం స్వామిని ఒంటె వాహనంపై కొలువదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం చేపట్టారు.